క్లుప్తంగా

బుట్టాయగూడెం ఎంపీడీవోగా గోపాలరెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో గోపాలరెడ్డి

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం ఎంపీడీవోగా ఎస్.గోపాలరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వేలేరుపాడులో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ప్రజలను సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

జీలుగుమిల్లి తహసీల్దార్‌గా సుందర్‌సింగ్


తహసీల్దార్‌గా సుందర్ సింగ్

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి తహసీల్దార్‌గా జి.సుందర్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ద్వారకాతిరుమలలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సుందర్‌సింగ్‌ను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు

ఎంపీడీవోగా పనిచేసిన స్వామికి సత్కారం


స్వామిని సత్కరిస్తున్న దృశ్యం


టి.నరసాపురం: టి.నరసాపురం ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఇప్పటివరకు పనిచేసిన ఎస్‌టీ స్వామిని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు సోమవారం సన్మానించారు. స్వామి ఇక్కడనుంచి దెందులూరు బదిలీ కావడంతో ఎంపీడీవో కార్యాలయంలో దుశ్శాలువాతో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ధారబోయిన లక్ష్మి పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా నూతన ఎంపీడీవోగా బీఎస్‌ఎల్ మంగా కుమారి బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం వారధి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వలవల తాతాజీ అధ్వర్యంలో సోమవారం విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. దాత కొండూరి అంజేశ్వరరావు, రత్నావతి దంపతుల వితరణతో రెండు సైకిళ్లను స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న దుండి లక్ష్మీకారుణ్య, 9వ తరగతి చదువుతున్న దొడ్డి యశశ్రీలకు అందజేసినట్లు వలవల తాతాజీ చెప్పారు. అనంతరం దాత కుటుంబ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, పీసుపాటి రామలక్ష్మి, కేఎల్‌ఎన్ ధనకుమార్, ఎం.శ్రీను, మనోజ్ఞ, నితిన్ పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ స్థలాల్లో ఆక్రమణల తొలగింపునకు చర్యలు


ధర్మాజీగూడెంలో ఆర్‌అండ్‌బీ స్థలాలకు మార్కింగ్ చేస్తున్న అధికారులు

లింగపాలెం : ధర్మాజీగూడెం ఆర్‌అండ్‌బీ స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలని స్పందనలో ఫిర్యాదు చేయటంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈమేరకు ఆర్‌అండ్‌బీ ఏఈ ఎస్ సుందరరావు సోమవారం ధర్మాజీగూడెంలో విలేకర్లతో మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉన్న ఆక్రమణలు గుర్తించేందుకు పంచాయతీ, రెవెన్యూ, అర్‌అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా మార్కింగ్ చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ హస్పటల్ నుంచి భోగోలు క్రాస్ రోడ్డు వద్ద హోలి ట్రీనిటీ స్కూల్ వరకు ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ చేస్తామన్నారు. ఆక్రమణల తొలగింపును పంచాయతీ వారికి అప్పగిస్తామన్నారు.

మజ్జిగ వితరణ

జంగారెడ్డిగూడెం : శ్రీరామచంద్ర మాక్‌సొసైటీ లిమిటెడ్ వద్ద సోమవారం మజ్జిగ పంపిణీ నిర్వహించారు. శ్రీసత్యసాయి సేవా సమితి, శ్రీరామచంద్ర గ్రూపు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రూపు సంస్థల యాజమాన్యం బీవీ కృష్ణారావు, బాచిరాజు సత్యనారాయణ మాట్లాడుతూ వర్షాలు పడే వరకు ఉచిత మజ్జిగ చలివేంద్రం ద్వారా మజ్జిగ వితరణ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీవీఎస్ జగదీష్‌కుమార్, సత్యసాయి సేవా సమితి నడిపల్లి రమేష్, ఎంవీ రామరాజు, ఎంవీఎస్ ధర్మారావు, ఎం.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణానికి మేలు


చింతలపూడి : మొక్కలు నాటుతున్న న్యాయవాదులు


కొయ్యలగూడెం : పర్యావరణంపై నిర్వహిస్తున్న డ్రాయింగ్ పోటీలు


ద్వారకాతిరుమల : గ్రంథాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న విద్యార్థులు

చింతలపూడి : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవచ్చునని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కలు పెంచడం వల్ల కలిగే లాభాలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు వివరించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సోమయ్య, న్యాయవాదులు మేడంకి సర్వేసు, ఉమర్ ఫరూక్, కనకదుర్గ భవాని, పారాలీగల్ వలంటీర్లు ఎండీ అక్బర్ ఆలి, నందిపాము ఏసురత్నం, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దుర్గ భవాని, సభ్యులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఛత్రపతి శివాజీ శ్రీ శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో బోటనీ డిపార్ట్‌మెంట్ సహకారంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల సీనియర్ అధ్యాపకుడు బద్రి నారాయణ అధ్యక్షులుగా వ్యవహరించగా, బోటనీ డిపార్ట్‌మెంట్ లెక్చరర్ ఝాన్సీ, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కో-ఆర్డినేటర్ బి.అశోక్, అధ్యాపకులు వెంకట్‌లాల్, ఎం.శ్రీనివాసరావు, విజయ దీపిక ప్రసంగించారు. ఈ సందర్భంగా బద్రి నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతి రక్షణ, కాలుష్య నివారణలో ముందుండి మార్పు కోసం శ్రమించాలి అని పిలుపునిచ్చారు. మానవ మనుగడ కోసం భావితరాల, భవిష్యత్తు కోసం పర్యావరణాన్ని రక్షించి, రాబోయే తరాలకు ఒక మంచి బాట వేయడంలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యం అని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, కళాశాల బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

కొయ్యలగూడెం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరాలలో భాగంగా లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. పర్యావరణానికి పెను విపత్తుగా మారిన ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడంతోపాటు మొక్కల పెంపకంతో పర్యావరణానికి మేలు చేయవచ్చన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ద్వారకాతిరుమల : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయ ఆవరణలో విద్యార్థులు సోమవారం మొక్కలు నాటారు. వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ముందుగా గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై డిబేట్ నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, ముఖ్యంగా ప్రకృతి ప్రసాదించిన చెట్లను కాపాడుకోవాలన్నారు. విద్యార్థులతో వృక్షో రక్షిత రక్షితః నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధం


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

లింగపాలెం : ధర్మాజీగూడెం శివారు కాటమరెడ్డిపల్లి గ్రామంలో సంకెళ్ల నాగరాజు అనే వ్యక్తి ఇంటిలో విద్యుదాఘాతం సంభవించి గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. కట్టుబట్టలతో మిగిలిన ఆ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.బాధిత కుటుంబానికి సర్పంచ్ కొత్తూరి మౌనిక, రమేష్ రూ.5 వేలు, సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటి వరప్రసాద్ రూ.5వేలు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్ రూ.5 వేలు, వైఎస్సార్ సీపీ నేతలు మోరంపూడి జగన్ రూ.5 వేలు, ముసునూరి వెంకటేశ్వరరావు రూ. 2,500, స్థానిక ట్రాక్టర్ల యూనియన్ రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని బాధితురాలు జోజికి అందజేశారు. ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు కృషి చేస్తామని నాయకులు భరోసా కల్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మేకల రాజు, నూతలపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. వీఆర్వో ప్రభాకరావు ఆ ఇంటిని పరిశీలించి నివేదికను అధికారులకు అందజేశారు.

మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం : మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్ల రాష్ట్ర నాయకులు బి.సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ వర్కర్ల రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాత జంగారెడ్డిగూడెం చేరుకుంది. మున్సిపల్ కార్మికులు ప్రచార జాతకు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి కొత్తబస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, అన్ని పనిముట్లు అందజేయాలని, తదతర డిమాండ్‌లతో ఇచ్ఛాపురం నుంచి ప్రచార జాత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 8 వరకు ప్రచారజాత నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాబు రంగారావు లక్ష్మి, సీఐటీయూ టౌన్ అధ్యక్షుడు పసుల సూర్యారావు, టౌన్ కార్యదర్శి షేక్ సుభాషిణి, మున్సిపల్ వర్కర్ల అధ్యక్షుడు బి.బాలరాజు, జిల్లా అధ్యక్షుడు రేలంగి నాగరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్, వేల్పుల రాజు, కోయ్యమ్మ, శ్రీను, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి సాయంత్రం ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా జేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి 51వ చండీహోమం ఆలయ అర్చకులు మనోజ్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించామన్నారు. హోమానికి కొత్తమాసు సునీత, శ్రీనివాసరావు, ముల్లంగి సంధ్య, ప్రసాదరెడ్డి, కర్పూరం మాధవి, త్రివిక్రమరావు దంపతులు, వాకదాని పుష్పవతి దంపతులు, అద్దంకి కవిత, సతీష్ ఉభయధారులుగా వ్యవహరించారు. హరేశ్రీనివాస అభయాంజనేయ కోలాట భజన బృందం కోలాటం నిర్వహించారు. నూకాంబికా మహిళా భక్త సేవా సమితి ప్రతినిధులు పాలపొంగళ్లు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రం జారీ చేయాలని ధర్నా


ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంకెం సత్యప్రసాద్ కుటుంబ సభ్యులు

ఏలూరు (టూటౌన్): అధికారులు కులధ్రువీకరణ పత్రం జారీ చేయకపోవడంతో తాను, తన కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు పడుతున్నామని కామవరపు కోట మండలం కె.కోట గ్రామానికి చెందిన అంకెం సత్యప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. తాము నాయకాస్ (ఎస్టీ) కులానికి చెందిన వారిమని గతంలో తనకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రం ఇచ్చారని ఆయన తెలిపారు. తాజాగా తన కుమారుడికి చదువు నిమిత్తం ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా రకరకాల కారణాలతో ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వ పథకం ఏదైనా పొందాలంటే తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రం అడుగుతున్నారని చెప్పాడు. దీనిపై కలెక్టర్ స్పందించి కిందిస్థాయి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేయాలంటూ విజ్ఞప్తి చేశాడు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేసారు.

రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన

ఏలూరు (టూటౌన్): భారత రెజ్లర్లు ఢిల్లీలో నెలరోజులుగా చేస్తున్న న్యాయపోరాటానికి సంఘీభావంగా భారత్ బచావో ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ పిలుపు మేరకు ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా భారత్ బచావో కమిటీ, ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, అభ్యుదయ సంఘాలు, అంబేడ్కర్ వాద సంఘాలు, బహుజన వాద సంఘాలు సంయుక్తంగా ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మణిపూర్లో నిర్వహిస్తున్న అల్లర్లను అదుపు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లిప్త వైఖరిని ఖండించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో భారత్ బచావో ఏలూరు జిల్లా అధ్యక్షుడు గుబ్బల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పాముదవీంద్రనాథ్, కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజనాల రామ్మోహనారావు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన రహదారి పన్నులను ఉపసంహరించుకోవాలి

ఏలూరు (టూటౌన్):పెంచిన త్రైమాసిక రహదారి పన్నులను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, జె.గోపి అన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులకు కేరళ తరహా సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాన్స్‌పోర్టు వాహనాలకు పెంచిన పెంచిన పన్నులను ఉపసంహరించాలని, ఇప్పటికే పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే 50 శాతం పన్ను అధికంగా ఉందన్నారు. రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరలు, పన్నులు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అధికంగా ఉండటం వల్ల ఇక్కడి రవాణా కార్మికులు ఇతర రాష్ట్రాల వారితో పోటీ పడలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రవాణా నిర్వాహకులకు సబ్సిడీపై రుణాలు అందించాలని కోరారు. ఆటోలు నిలుపుకునేందుకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, ఆటో డ్రైవర్లకు షెల్టర్‌తో కూడిన పార్కింగ్ స్టాండ్లను ఏర్పాటుచేయాలని కోరారు.

యువత పోరాటాలకు సిద్ధంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జల ఈశ్వరయ్య

జంగారెడ్డిగూడెం : నిరుద్యోగుల్ని పెంచుతున్న ప్రభుత్వాలను గద్దే దింపడానికి ఏఐవైఎఫ్ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానిక రోటరీ క్లబ్‌లో అఖిల భారత యువజన సమాఖ్య ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కుంచే వసంతరావు అధ్యక్షనత జరిగిన కార్యక్రమంలో ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్‌రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగాన్ని కేవలం ఎన్నికల అస్త్రంగా వాడుకుంటూ ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. గడచిన నాలుగేళ్లల్లో నిరుద్యోగం 18.7శాతం నమోదైనట్లు తెలిపారు. ఈ నెల 27, 28, 29, 30 తేదీలలో అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర స్థాయి సమావేశాలు గుంటూరులో జరుగుతాయని ఆ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణరాజు, కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, బుట్టాయగూడెం మండల కార్యదర్శి సోదెం వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌ఎస్ భూములపై లోకాయుక్త ఆదేశాలు పాటించాలి


జంగారెడ్డిగూడెంలో ఆదివాసీ మహాసభ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : వీఎస్‌ఎస్ భూములపై పోలవరం స్పెషల్ కలెక్టర్‌కు లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలు పాటించాలని ఆదివాసీ మహాసభ ఏలూరు జిల్లా కార్యదర్శి మిడియం వెంకటస్వామి కోరారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన ఆదివాసీ మహాసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం మండలంలోని తల్లవరం, కొత్తమామిడిగొంది, గాజులగొంది, ములగలగూడెం, వాడపల్లి, సరుగుడు, పైడాకుల మామిడి, పల్లపూరు, టేకూరు, చీడూరు, శివగిరి, కొరుటూరు, సిరివాక, మామిడిగొంది ఈ 14 గ్రామాలలో 11,031 ఎకరాల వనసంరక్షణ సమితికి చెందిన భూమి ఉందన్నారు. వీటికి చెల్లించే నష్టపరిహారం విషయంలో పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్‌కు లోకాయుక్త ఆదేశాలు జారీచేసిందని, దానిని పాటించాలని కోరారు. కొత్త భూసేకరణ చట్టం సెక్షన్ 42(3) ప్రకారం వీఎస్‌ఎస్ భూములను సేకరించేటప్పుడు సభ్యులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ మహాసభ నాయకులు రామాల యాకోబు, మిడియం వెంకటేష్, మూలెం రాంబాబు, అయినాపురపు సూర్యనారాయణ, వీఎస్‌ఎస్ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

గుమ్మడిపల్లి పెదవాగు ప్రాజెక్టు, కాలువల మరమ్మతులు చేపట్టాలి

ఏలూరు (టూటౌన్) : వేలేరుపాడు, కుక్కునూరు మండలాలలో వరి రైతులకు సాగునీటిని అందిస్తున్న గుమ్మడిపల్లి పెదవాగు ప్రాజెక్టు, కాలువల మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు కింద ఆంధ్రాలో ఉన్న మేడేపల్లి, రామవరం, కొమ్ముగూడెం, దాచారం గ్రామ పంచాయతీలలోని 15 వేల ఎకరాల భూములకు సంబంధించి పెదవాగు ప్రాజెక్టుకు కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో మట్టి పూడికలు, గండ్లు పడి నీరు వృథాగా పోతుందన్నారు. దీంతో రైతుల భూములకు సాగు నీరు అందక వరి, మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు గడ్డాల ముత్యాలరావు మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు కాలువల మరమ్మతులు వెంటనే చేపట్టాలని కోరారు. ధర్నా అనంతరం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ వేలేరుపాడు మండల కార్యదర్శి సోయం చంద్రరావు, డివిజన్ మండల నాయకులు కారం సత్యవతి, మేడేపల్లి సర్పంచ్, ఎంపీటీసీ కట్టం రాంబాబు, తుర్రం తమ్మయ్య, కట్టం వీరాస్వామి, ఆశి లక్ష్మయ్య, మోసం రాజారావు, కుంజా రాజులు, పాయం బజారమ్మ, కారం బాబూరావు, మడకం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

150వ రోజు 'గడపగడపకు' విజయవంతం చేయాలి

లింగపాలెం : చింతలపూడి నియోజకవర్గ గడపగడపకు మన ప్రభుత్వం 150వ రోజు కార్యక్రమం ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఆధ్వర్యంలో కామవరపుకోటలో ఈనెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు లింగపాలెం మండల వైఎస్సార్ సీపీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి లింగపాలెం మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని ఆయన కోరారు. బుధవారం ఉదయం 8 గంటలకు కె.కోట ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి ర్యాలీగా తరలివెళ్లడం జరుగుతుందన్నారు.

అతిసారపై ఇంటింటా సర్వే చేయాలి

గణపవరం: అతిసార వ్యాధి నివారణ పక్షోత్సవాల సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి అతిసార వ్యాధి లక్షణాలున్న పిల్లలను గుర్తించి, వారికి తగిన చికిత్స అందించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. సోమవారం గణపవరం పీహెచ్‌సీలో అతిసార వ్యాధి నివారణ పక్షోత్సవాల సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సరిపల్లెలో అతిసార వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అతిసార లక్షణాలున్న పిల్లలకు ఓఆర్‌ఎస్ ద్రావణం, జింక్ మాత్రలను వైద్యనిపుణులు సూచించారని, అందువల్ల విరేచనాలు అయ్యే పిల్లలకు తప్పనిసరిగా ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలు ఇవ్వాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు అతిసార వ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన సదస్సు నిర్వహించాలని, ఇంటింటా సర్వేచేసి అతిసార లక్షణాలున్న ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించాలని డా.సంతోష్ సూచించారు. పిల్లలకు అతిసార లక్షణాలు కనిపిస్తే వారికి ఓఆర్‌ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. వీటి వాడకం వల్ల పిల్లలు నీరస పడిపోకుండా, వారు కోల్పోయిన శక్తిని, బలాన్ని యథాస్థితికి తీసుకురావచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకుడు యోహాన్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రేపు మెగా ఉచిత వైద్య శిబిరం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కురెళ్ల రాంబాబు శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంగిడిగూడెంలో నిర్వహించే ఈ శిబిరంలో విజయవాడ కామినేని ఆసుపత్రి వైద్యులు సేవలు అందిస్తారన్నారు. గుండె, మోకాళ్లు, నడుము, మెడనొప్పి, చెవి, ముక్కు, గొంతు, స్త్రీల సమస్యలకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తారని తెలిపారు. రామచంద్ర శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి వ్యాధులపై పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శిబిరానికి హాజరయ్యే వారు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీకార్డు, పాత రిపోర్టులు తీసుకు రావాలన్నారు. వివరాలకు 97043 98621, 99482 99660, 91331 67721, 96668 50230, 96032 40979 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జీలుగుమిల్లి ఎంపీడీవోగా కృష్ణప్రసాద్ బాధ్యతల స్వీకరణ


ఎంపీడీవో కృష్ణప్రసాద్‌ను అభినందిస్తున్న సిబ్బంది

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి ఎంపీడీవోగా కేఆర్‌ఎస్ కృష్ణ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొయ్యలగూడెంలో పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా జీలుగుమిల్లి ఎంపీడీవోగా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఆయన్ను కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గతంలో తాను జీలుగుమిల్లి మండలంలో పనిచేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉన్నందున అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కొయ్యలగూడెం ఎంపీడీవోగా శ్రీలక్ష్మి బాధ్యతల స్వీకరణ


ఎంపీపీ రామారావును కలిసిన ఎంపీడీవో శ్రీలక్ష్మి

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం ఎంపీడీవోగా ఆర్.బీబీ శ్రీలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గణపవరం మండల పరిషత్ నుంచి పదోన్నతితో బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ గంజిమాల రామారావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో తన చాంబర్‌కి విచ్చేసిన ఆమెకు పరింపూడి పంచాయతీ ఈవో సీహెచ్ సత్యనారాయణ, కార్యాలయ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సంక్షేమ పథకాలను సకాలంలో అర్హులైన వారికి అందించడంలో సమైక్యంగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఉద్యోగులను, వలంటీర్లను ఆమె కోరారు.

వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : వివాహిత ఫిర్యాదు మేరకు వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో నివాసం ఉంటున్న అంబటి హరీష్‌కు, హేమసుందరికి 2020లో వివాహమైంది. కొన్నిరోజులు సంసారం సజావుగానే సాగినా హరీష్ చెడువ్యసనాలకు బానిసై ఇటీవల హేమసుందరిని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. దీనికి తోడుగా తన అడ్డు తొలగించుకుంటే అదనపు కట్నం వస్తుందని కుటుంబ సభ్యులు సైతం గొడవను ప్రోత్సహిస్తున్నారని హేమసుందరి ఫిర్యాదులో పేర్కొంది. దీంతో హరీష్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.